



పతకాలతో పోలీసులు

నేడు బాబ్లీ గేట్ల మూసివేత

- ఎస్సారెస్పీ 8 గేట్ల ద్వారా నీటి విడుదల
- ప్రాజెక్టులోకి 34 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మెండోర, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లను బుధవారం మూసివేయనున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు కేంద్ర జల సంఘం అధికారులతో కలిసి ఇరు రాష్ట్ర ప్రాజెక్టు అధికారులు గేట్లను మూసివేస్తారు. దీంతో ఎస్సారెస్పీలోకి వరద తగ్గుముఖం పట్టనుంది. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎనిమిది వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ చక్రపాణి తెలిపారు. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 22వేల క్యూసెక్కుల వరద చేరడంతో నాలుగు వరద గేట్ల ద్వారా 12వేల 500 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. ఉదయం గంట వ్యవధిలోనే ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో పెరగడంతో మరో నాలుగు గేట్లను ఎత్తి ఎనిమిది గేట్ల ద్వారా గోదావరిలోకి 25వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టులోకి 34వేల654 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 2వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 6వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుత నీటిమట్టం 1091 అడుగుల 80 టీఎంసీల నీటి నిల్వ ఉందని ప్రాజెక్టు ఈఈ తెలిపారు.



ప్రాజెక్టు నుంచి గోదావరిలోకి విడుదల అవుతున్న నీరు

ముదిరాజ్‌లు రాజకీయ చైతన్యం పెంచుకోవాలి

- ఎమ్మెల్యేలుగా గెలిచి చట్టసభల్లో అడుగు పెట్టాలి
- బీసీ-డీ జాబితా నుంచి బీసీ-ఏ గ్రూప్‌లోకి మార్చడానికి ఐక్యం కావాలి
- ముదిరాజ్ మహా సభ జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశం ముదిరాజ్

8

‘భూభారతి’ని పరిష్కరించాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

8



రుద్రూరులో వర్షానికి ధాన్యం కుప్పలోకి చేరిన నీరు

మొంథా కలవరం

తుపాన్ ప్రభావంతో అన్నదాత ఆగమాగం

- జిల్లాలో అకాల వర్షంతో రైతుల విలవిల
- కల్లాలు లేక రోడ్లపైనే ధాన్యం నిల్వలు
- కేంద్రాల్లో అరకొరగా టార్పాలిన్లు
- శాఖల మధ్య కొరవడిన సమన్వయం
- పౌరసరఫరాల శాఖపైనే పూర్తిభారం
- జిల్లాలో 704 ధాన్యం సేకరణ కేంద్రాలు
- 354 కేంద్రాల ద్వారా 1.15లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ

అకాల వర్షాలు రైతులను కలవర పెడుతోంది. సీజన్ ప్రారంభంలో ఆలస్యంగా కురిసిన వర్షాలతో వరి సాగు వెనకబడింది. ఇప్పుడు పంట చేతికి వచ్చే సమయంలో కురుస్తున్న అకాల జల్లులు అన్నదాతకు కునుకు లేకుండా చేస్తున్నాయి. జిల్లాలో 4.37లక్షల ఎకరాల్లో వరి పంట సాగుకాగా వాతావరణం అనుకూలించకపోవడంతో కొనుగోళ్లు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. అకాల వర్షాల వల్ల చేతికి వచ్చిన పంట తడిసి ముద్దవుతోంది. కల్లాలు లేక రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. టార్పాలిన్‌లు లేకపోవడంతో చేతికి వచ్చిన పంట నీళ్లపాలవుతోంది.



కోటగిరి తడిసిన తూకం వేసిన ధాన్యం

నిజామాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో 704 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేశారు. 253 కేంద్రాలు ఐకేపీ ద్వారా, 441 కేంద్రాలు పీఏసీఎస్‌ల ద్వారా, 10 కొనుగోలు కేంద్రాలు మెప్మా ద్వారా ఏర్పాటు చేశారు. ఇప్పటికే 354 సెంటర్ల ద్వారా లక్షా15వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయినా ఇంకా ధాన్యం రోడ్లపైనే ఉంటుంది. ధాన్యం కొనుగోళ్లకు ప్రధాన అడ్డంకిగా తేమశాతం నిబంధన రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. పదిరోజులుగా వాతావరణం పూర్తిగా మేఘావృతం కావడంతో ధాన్యం సరిగా ఆరడంలేదు. దీంతో 17 శాతం కంటే తక్కువగా తేమ ఉన్నా ధాన్యాన్ని కొనుగోలు చేయడంలేదు. 3.90 లక్షల ఎకరాల్లో సన్న, 43వేల ఎకరాలల్లో దొడ్డు ధాన్యం సాగు చేశారు. రికార్డుస్థాయిలో 8లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం వస్తుందని అధికారుల అంచనావేసి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే తుఫాన్ జల్లులు రైతులను, అధికారులను భయపెడుతున్నాయి.

సమన్వయ లోపం..

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం కొనుగోళ్లకు ప్రధాన అడ్డంకిగా మారింది. ఐకేపీ, పీఏసీఎస్‌ల

మిగతా 8వ పేజీలో...

కమీషన్ కోసమే మొగ్గు..

ప్రతీ క్వింటాకు రూ.32 ఐకేపీ, పీఏసీఎస్‌లకు ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ ఏర్పాట్లలో మాత్రం ఆ శాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున వరిపంటను కోయవద్దని, కేంద్రాలకు తీసుకురావద్దని అధికారులు చెబుతున్నారు. అయితే కమీషన్‌లు వస్తున్నాయనే ఆశతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. తీరా కొనుగోలు కేంద్రాల వద్ద సరైన వసతులు లేక చేతికివచ్చిన పంట నీళ్లపాలు అవుతోంది.

ప్రతిభకు పతకం

- 95 మందికి పోలీసులకు సేవా గుర్తింపు
- రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపుపై సీపీ అభినందనలు

సుభాష్‌నగర్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో ప్రతిభకనబర్చిన పోలీసు సిబ్బందికి పోలీసు కమిషనర్ సాయిచైతన్య పతకాలు అందజేశారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పతకాలను అం దజేసి సిబ్బందిని అభినందించారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన పోలీసు మహోన్నత సేవా పతకం, ఉత్తమ సేవా పతకం, అతి ఉత్కృష్ట సేవా పతకాలు మొత్తం 95 మందికి పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది చూపిన తెగువ ప్రశంసనీయమైందన్నారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ రామ్‌చందర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువే..

- వానొస్తే ఆర్మూర్‌లో రోడ్లపైకి మురుగు
- పట్టణంలో ప్రజల తప్పని అవస్థలు
- పట్టించుకోని మునిసిపల్ అధికారులు

6

కార్మికుల సంక్షేమానికి పోరాటం

6

- సమస్యల పరిష్కారానికి కృషి
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కల్వకుంట్ల కుటుంబం రాష్ట్రాన్ని దోచుకుంది

- కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవిత, సంతోష్ దొంగలు
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

మోపాల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని నలుగురు దొంగలు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, కవిత, సంతోష్‌రావు దోచుకున్నారని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మండిపడ్డారు. మంగళవారం మోపాల్ సొసైటీ ఆవరణలో నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రైతులకు తాటిపత్రిలను పంపిణీ చేశారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆలీబాబా నలుగురు దొంగల్లా దోచుకుందన్నారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్, కల్వకుంట్ల కుటుంబ సభ్యులు తెలంగాణపై పడి ప్రజల సొమ్మును దోచుకున్నారని విమర్శించారు. మొసలికన్నీరు కారుస్తూ మాజీ ఎంపీ కవిత మోపాల్ మండలంలో తిరుగుతూ పోడు భూముల గురించి మాట్లాడడం సిగ్గుచేటుగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. పదేళ్ల వారి ప్రభుత్వం ఉన్నపుడు పోడు భూముల గురించి ఊసే రాలేదని దళితులకు మూడు ఎకరాలు ఇస్తామని ప్రభుత్వ హయాంలో వారిని మోసం చేశారన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒకటే అని, ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. బీజేపీ నాయకులను ఊర్లో తిరగనీయకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ చంద్రశేఖర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, సొసైటీ చైర్మన్‌లు గంగారెడ్డి, మోహన్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ లింగన్న, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య, హాజరైన అధికారులు

పెండింగ్ కేసులను వెంటనే పరిష్కరించాలి

- సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- సమీక్ష సమావేశంలో పోలీసు కమిషనర్ సాయి చైతన్య

సుభాష్‌నగర్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, జూదం, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాలాంటి వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టి చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ సాయిచైతన్య అన్నారు. జిల్లాకేంద్రంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో మంగళవారం నిజామాబాద్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ అధికారులతో నెలవారి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా పెండింగ్ కేసులు క్లియర్ చేయాలని ఆదేశించారు. పోక్సో, గ్రేవ్ కేసులను త్వరితగతిన దర్యాప్తులు పూర్తిచేయాలన్నారు. సైబర్ నేరాలపట్ల ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జ్‌షీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకశంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. తరచూ నేరాలకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు జారీచేశారు. ఈ సమావేశంలో అదనపు డీసీపి బస్వారెడ్డి, ఏసీపీ రాజవెంకట్ రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సతీష్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ రైటర్స్‌కు శిక్షణ

పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న రైటర్స్‌కు సీపీ సాయిచైతన్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సమగ్రంగా రికార్డుల నిర్వహణలో నైపుణ్యం పెంపొందించడం, పారదర్శకత, సమయపాలన పోలీస్ వ్యవస్థ బలోపేతానికి ముఖ్యమైన అంశాలని తెలిపారు.



ఆధునిక పోకడలతో మారిన జీవన విధానం మనిషిని ఆరోగ్యపరంగా అతలాకుతలం చేస్తోంది. దీంతో బ్రెయిన్ స్ట్రోక్ లాంటి ప్రమాదకరమైన వ్యాధి బారిన పడి ఉన్న ఫలంగా మనిషి అవయవాలలో చలనం కోల్పోయి కదలలేని పరిస్థితికి వెళ్తున్నారు. ఒక దశలో ఈ స్ట్రోక్ బారిన పడిన వారిలో కొంతరు త్వరగా రికవరీ అవుతుంటే మరికొందరు ప్రాణాలను సైతం కోల్పోయిన ఘటనలు తరచుగా కనిపించడం పారిపాటిగా మారింది. పక్షవాతాన్ని నివారించేందుకు, ప్రజల్లో అవగాహన పెంచేందుకు వరల్డ్ స్ట్రోక్ ఆర్గనైజేషన్ ముందుకు వచ్చింది. ప్రతి సంవత్సరం అక్టోబరు 29వ తేదీని ‘వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే’గా నిర్వహిస్తున్నారు. నేడు ప్రపంచ బ్రెయిన్ స్ట్రోక్ దినం సందర్భంగా ప్రత్యేక కథనం..

మెదడు పోటు.. మహా చేటు



- జీవన శైలి మార్పుతోనే బ్రెయిన్ స్ట్రోక్‌కు చెక్
- మానసిక ఒత్తిడి నియంత్రనే అత్యంత కీలకం
- క్రమం తప్పని వ్యాయామం ప్రధానం

నిజామాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మానవ శరీరంలో మెదడుకు రక్త సరఫరా నిలిచిపోయినప్పుడు బ్రెయిన్ స్ట్రోక్ వస్తుందని (పక్షవాతం) ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ బ్రెయిన్ స్ట్రోక్‌లలో ఇస్కిమిక్ స్ట్రోక్ అనేది మెదడులోని రక్తనాళాలలో రక్తం గడ్డ కట్టడం లేదా కొవ్వు నిల్వలు పేరుకుపోవడం వల్ల మెదడుకు రక్త ప్రసరణ నిలిచిపోతుంది. హేమరేజిక్ స్ట్రోక్‌లో రక్తనాళం పగిలిపోవడం (చిట్లిపోవడం) వల్ల మెదడు లోకి రక్తం లీక్ అవుతుంది. రక్త ప్రవాహంలో తాత్కాలిక అడ్డంకులు ఏర్పడి నప్పుడు తాత్కాలిక ఇస్కిమిక్ అటాక్ అనేది సంభవిస్తుంది. ఇది బ్రెయిన్ స్ట్రోక్ హెచ్చరిక లాగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

(మిగతా 8వ పేజీలో...)

నేడు వరల్డ్ బ్రెయిన్ స్ట్రోక్ డే

‘గోల్డెన్ అవర్’లో చికిత్సతో ప్రాణాలు భద్రం..

: డాక్టర్ శ్రీకృష్ణాదిత్య, న్యూరో సర్జన్, నిజామాబాద్

బ్రెయిన్ స్ట్రోక్ అనేది మెదడులో రక్తప్రసరణ ఆగిపోవడం, రక్తనాళం పగిలిపోవడం వల్ల సంభవించే అత్యవసర వైద్య పరిస్థితి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి 4 సెకన్లకూ ఒక వ్యక్తి స్ట్రోక్‌కు గురవుతున్నారు. ‘స్ట్రోక్ వచ్చిన తర్వాత మొదటి 4.5 గంటలు ‘గోల్డెన్ అవర్’ అని పిలుస్తారు. ఈ సమయం లోపల రోగికి సరైన చికిత్స అందితే మెదడు నష్టాన్ని గణనీయంగా తగ్గించి, రోగి పూర్తిగా కోలుకునే అవకాశం ఉంటుంది. ఆలస్యం జరిగిన ప్రతి నిమిషం వేల మెదడు కణాల నష్టానికి దారితీస్తుంది.’ ముఖం వంగిపోవడం, చేయి బలహీనపడటం, మాట తడబడటం వంటి లక్షణాలు కనిపించగానే వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లాలి. ప్రజలు గోల్డెన్ అవర్‌లో స్పందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు.



సాయవ్వ (ఫైల్)

ఒక్కరిగా మరణించి.. పలువురిలో జీవించి..

- ఆదర్శనీయం సాయవ్వ అవయవ దానం

డొంకేశ్వర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించిన మహిళ అవయవాలను కుటుంబ సభ్యులు మంగళవారం దానం చేసి పలువురికి ప్రాణదానం చేశారు. డొంకేశ్వర్ మండలంలోని గంగాసారం గ్రామానికి చెందిన బద్దం శ్రీనివాస్‌రెడ్డి, భార్య సాయవ్వ వృత్తి వ్యవసాయం చేసుకుంటూ జీవనాన్ని గడుపుతున్నారు. ఇటీవల బద్దం సాయవ్వ తల్లి అనారోగ్య కారణంగా మృతి చెందారు. తల్లి లేదనే వార్త వినగానే సాయవ్వ కుప్పకూలిపోయింది. తల్లిని తలుచుకుంటూ బ్రెయిన్ స్ట్రోక్ గురైంది. దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించగా హైదరాబాద్ తీసుకెళ్లమని వైద్యులు తెలిపారు. దీంతో ఆమెను హైదరాబాద్ తరలించి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. ఆమె కోమాలో ఉంది. అనంతరం ఆమెకు బ్రెయిన్ స్ట్రోక్ రావడం వల్ల మరణించిందని డాక్టర్లు నిర్ధారించారు. ఆమెకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఆమె భర్త శ్రీనివాస్ పిల్లలు చాలా కలత చెందారు. బద్దం శ్రీనివాస్ రెడ్డి సహృద యంతో ఆమె అవయవాలను దానం చేశారు.

కమీషన్ల కోసం పీడించి కాంట్రాక్టర్లను బెంబేలెత్తించారు..

- వారు పారిపోవడంతోనే మాధవనగర్ ఆర్‌వోబీ పనుల్లో ఆలస్యం
- త్వరలో వంతెన కోసం నిరాహార దీక్షకు ప్రణాళిక : ఎంపీ అర్వింద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్, చిత్రంలో ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మాధవనగర్ రైల్వే ఓవర్‌బ్రిడ్జ్ విషయంలో గతంలో కవిత కమీషన్‌ల కోసం బెదించడం వల్లే కాంట్రాక్టర్లు పారిపోయారని, ఆర్‌వోబీల ఆలస్యానికి కవితే కారణమని ఎంపీ అర్వింద్ ధర్మపురి ఆరోపించారు. మంగళవారం అర్బన్ ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మునిసిపాలిటీలకు విడుదలైన నిధులు కేంద్రం నుంచి వచ్చినవేనన్నారు. కేంద్రం వాటా 80శాతం ఉండగా రాష్ట్రవాటా 20శాతమేనని,

మిగతా 8వ పేజీలో...

రాబోయే 20ఏళ్ల అవసరాలకు మాస్టర్ ప్లాన్

- బోధన్, ఆర్మూర్ మునిసిపాలిటీలకు ప్రణాళిక
- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

సుభాష్‌నగర్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0లో భాగంగా బోధన్, ఆర్మూర్ మునిసిపల్ పట్టణాల్లో ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపకల్పన విషయమై కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అధ్యక్షతన మంగళవారం నగర పాలక సంస్థ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో మొదటి సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సౌకర్యాలను మెరుగుపరుస్తూ, ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు మాస్టర్ ప్లాన్ దోహదపడుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సంబంధిత శాఖల అధికారులు నిర్దీత నమూనాలో ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు అవసరమైన వివరాలను పక్షం రోజులలోపు

మిగతా 8వ పేజీలో...

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు

బోధన్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలూర క్యాంప్ శివారులో ఈనెల 2న ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఐరుకురికి గాయాలయ్యాయని బోధన్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి మంగళవారం విజయ్ కుమార్ బోధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు.

రౌడీ షీటర్‌కు వారం జైలు

నవీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల మద్యం తాగి న్యూసెన్స్ చేసిన మలవత్ కృష్ణ అనే రౌడీ షీటర్‌కు కోర్టు వారం జైలుశిక్ష విధించిందని ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. మద్యం తాగి న్యూసెన్స్ చేయడంతో అతడిపై పెట్టి కేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చగా నిందితుడికి వారం జైలుశిక్ష పడిందని ఎస్‌ఐ వివరించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన గుగ్గోత్ మోహన్, అమృత్ రాథోడ్‌లను మంగళవారం కోర్టులో హాజరుపర్చగా వారికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష పడిందని ఎస్‌ఐ చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి..

సుభాష్‌నగర్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఆరుగురికి జైలు శిక్ష, 10మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 16 మందిని సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ముందు హాజరుపర్చగా 10మందికి రూ.13వేల జరిమానా, ఆరుగురికి 2 రోజుల జైలు శిక్ష విధించారన్నారు.

మాజీ మంత్రి తండ్రికి నివాళి



నివాళులర్పిస్తున్న దృశ్యం

బోధన్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ మంగళవారం ఉదయం మృతిచెందారు. బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్, ఆయన సతీమణి ఆయేషాఫాతిమా, బీఆర్ఎస్ జిల్లాధ్యక్షుడు జీవన్‌రెడ్డి తదితరులు సత్యనారాయణ మృతదేహానికి నివాళులు అర్పించారు.

విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

బోధన్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): విజ్ఞానార్జనలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని ఇంటర్ విద్య ప్రత్యేక అధికారి దాసరి ఒడ్డెన్న అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మదునూరు బాలికల జూనియర్ కళాశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరిన ప్రతి విద్యార్థిని విద్యావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఇంటర్ విద్యార్థులకు నవంబరులో సిలబస్ పూర్తి చేసి ప్రాక్టికల్స్‌కు సిద్ధం చేసేలా చర్యలు తీసుకోవాలని కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్, ప్రిన్సిపాళ్లు నికత్ కౌసర్, జావర్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎంపీ అరవింద్ సమక్షంలో బీజేపీలో చేరిన బోధన్ యువకులు

బీజేపీ విజయానికి కృషి చేయాలి

బోధన్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని ఎంపీ అరవింద్ పిలుపునిచ్చారు. మండలంలోని పలు గ్రామాల యువకులు మంగళవారం ఎంపీ ధర్మపురి అరవింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి, ఆర్యన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ గుప్తా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డి మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి బీజేపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ సిద్ధాంతాలు, అభివృద్ధి పనులు నచ్చి యువకులు భారీ సంఖ్యలో పార్టీలో చేరారని ఎంపీ అరవింద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సిర్ర సుదర్శన్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.





చినుకు పడితే చెరువే

▸▸ వానొస్తే ఆర్మూర్‌లో రోడ్లపైకి మురుగు ▸▸ పట్టించుకోని మునిసిపల్ అధికారులు ▸▸ పట్టణంలో ప్రజల అవస్థలు

పెర్కిట్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):చినుకు పడితే చాలు ఆర్మూర్‌లోని రోడ్లు చెరువుల్లా మారుతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. వాన పడిన ప్రతిసారి వ్యాపార సముదాయాల్లోకి పూర్తిగా వర్షపునీరు చేరి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పట్టణం లోని బస్టాండ్ నుంచి మామిడిపల్లి చౌరస్తా కు వెళ్లే ప్రధాన రహదారి కృష్ణవేణి పాఠశాల వద్ద వర్షం ఎప్పుడొచ్చినా ఎక్కువ కురిసిన చెరువులా మారిపోతుంది. వారం కిందట కురిసిన వర్షానికి డ్రైనేజీ పూర్తిగా నిండిపోయి వర్షపునీరు వెళ్లడానికి వీలులేక రోడ్లపైకి చేరింది. ఏటా సమస్య ఏర్పడుతున్నా మునిసిపల్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ప్రతిసారి రహదారి చెరువులా మారడంతో బడులకు వెళ్లే విద్యార్థులు, ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వ్యర్థాలను వెంటనే తొలగించాలి

వర్షం పడిన ప్రతిసారీ మా దుకాణం ముందు ప్రాంతం చెరువులా మారి డ్రైనేజీ వ్యర్థాలు వ్యాపారసముదాయాల్లోకి చేరి ఇబ్బందులు పడుతున్నాం. పుర సిబ్బంది వ్యర్థాలను వెంటనే తొలగించాలి. రోడ్లపైకి మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి.

- శ్రీనివాస్, స్థానికుడు

మురుగుకాలువల మరమ్మతులకు నిధులొచ్చాయి

ఆర్మూర్ మున్సిపాలిటీకి రూ.15 కోట్ల వరకు నిధులు మంజూరు అయ్యాయి. పట్టణంలోని అభివృద్ధి కార్యక్రమాలు, పలు వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ, ఇతర మరమ్మతులతో పాటుగా రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా పక్కనే ఉన్న డ్రైనేజీ వ్యవస్థ మరమ్మతులకు రూ.50 లక్షల వరకు నిధులను కేటాయించనున్నాం. రానున్న వానాకాలం వరకు సమస్యను పరిష్కరిస్తాం. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

- రాజు, మునిసిపల్ కమిషనర్, ఆర్మూర్



మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ ప్రత్యేక అధికారి ఒడ్డెన్న

వెనకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి

▸▸ ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ ప్రత్యేక అధికారి ఒడ్డెన్న

కోటగిరి,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ ప్రత్యేక అధికారి ఒడ్డెన్న సూచించారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. కళాశాలలో రికార్డులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ ప్రయోగ పరీక్షలు తప్పనిసరి నిర్వహించాలన్నారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ పరీక్షల సీసీ కెమెరాల నిఘాలో కొనసాగుతాయని, విద్యార్థులను అందుకు అనుగుణంగా పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఎసెట్, నీట్ పరీక్షలు రాయించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఇప్పటి నుంచే ప్రతి శనివారం మండలంలోని పలు జిల్లా పరిషత్ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు ప్రభుత్వ కళాశాలల్లో చేరేలా అవగాహన కల్పించాలన్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సర్దార్ పాషా, అధ్యాపకులు ప్రమోద్, అనిల్, దత్తాత్రి పాల్గొన్నారు.

పోలీసుల త్యాగాలను స్మరించుకుందాం

బోధన్,అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసులను స్మరించుకుందామని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో పోలీసులతో పాటు ఇతర స్వచ్ఛంద సంస్థల యువకులు, అధికారులు రక్తదానం చేశారు. 92మంది రక్తదాన శిబిరానికి హాజరై రక్తం అందజేశారని, ఆ యూనిట్లను రెడ్‌క్రాస్ సొసైటీకి అందిస్తామని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. రక్తదానం ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతుందని, రక్తదానం గొప్పదని ఏసీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ప్రతినిధులు బసవేశ్వర్ రావు, వైద్యులు, కౌన్సిల్ కిషోర్, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు అంజనేయులు, రాజశేఖర్, సీఐలు వెంకటనారాయణ, విజయ్‌బాబు, కృష్ణ, ఎస్‌ఐలు మచ్చేందర్ రెడ్డి, చంద్రమోహన్, సాయన్న, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో రక్తదానం ప్రతినిధులు

కార్మికుల సంక్షేమానికి సీఐటీయూ పోరాటం

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్

బోధన్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమం కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. మంగళవారం పట్టణంలో సీఐటీయూ జిల్లా 11వ మహాసభను నిర్వహించారు. సీఐటీయూ జెండాను సీనియర్ నాయకులు రామ్మోహన్ రావు ఆవిష్కరించారు. రాష్ట్రంలో కార్మిక సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ సీఐటీయూ వారికి అండగా నిలబడి పోరాటాలు చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ పేర్కొన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే చట్టాలను 4కోడ్‌లుగా విభజించి కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను తీసుకువస్తుందని కార్మికుల కనీస వేతనాలు అమలు కాక ఉద్యోగ భద్రత లేక సతమతమవుతున్నారన్నారు. అసంఘటిత కార్మికులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారికి అండగా ఉండాల్సిన బాధ్యత సీఐటీయూ నాయకులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై కార్మికులు కుల, మతాలు, ప్రాంతాలకు అతీతంగా సంఘటిత పోరాటాలు చేసినప్పుడే కార్మిక హక్కులు కాపాడబడతాయన్నారు. ఈ సభలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య, జిల్లా అధ్యక్షుడు శంకర్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్, కొండ గంగాధర్, అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు, రాష్ట్ర వర్కర్ జిల్లా అధ్యక్షురాలు విజయ, పంచాయతీ జిల్లా కార్యదర్శి గంగాధర్, బీడీ యూనియన్ జిల్లాధ్యక్షుడు మోహన్, ఇరిగేషన్ జిల్లాధ్యక్షుడు గణేష్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్

దుకాణాల్లో తనిఖీలు

బోధన్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వ్యాపార దుకాణాలలో తూనికలు, కొలతల శాఖ అధికారి సందీప్ కుమార్, సిబ్బంది మంగళవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలో తక్కెళ్లను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరు లైసెన్స్‌లను కలిగి ఉండాలన్నారు. తూకంలో ఏ మాత్రం తేడా వచ్చిన కేసులు తప్పవని హెచ్చరించారు. ఎలక్ట్రికల్ కాంటాల్లోనూ కొందరు వ్యాపారులు తూకాల్లో మోసాలు చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలన్నారు. మోసాలకు పాల్పడకుండా వ్యాపారం చేసుకోవాలని, వినియోగదారులను ఇబ్బంది పెట్టవద్దన్నారు.



తక్కెళ్లను పరిశీలిస్తున్న అధికారులు



పుష్కరిణిలో పూజలు చేస్తున్న పురోహితులు



పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

ఘనంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

భీమ్‌గల్, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన లింబాద్రిగుట్టపై కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ పూజారులు అంకురార్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు ప్రధాన అంశమైన అంకురార్పణ కార్యక్రమాన్ని ఆగమ శాస్త్ర ప్రకారం అర్చకులు ద్వారపాత్రలలో సేకరించిన పుట్టమన్నుపై బీజములను ఆలికి మొక్కలను మొలకెత్తించే కార్యమే అంకురార్పణలో ముఖ్య ఘట్టం. ఇలా మొలకెత్తిన మొక్కలు దేశంలో సర్వ సమృద్ధుల తొలగి అభివృద్ధి పొందడానికి సూచిక అని పండితులు పేర్కొన్నారు. అంతకుముందు స్వామివారి గర్భాలయంలో ఉత్సవ ప్రారంభానికి సంకేతంగా అఖండ దీపారాధన, పుణ్యాహవచనం నిర్వహించి, శ్రీ మద్భాగవత పారాయణం చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

ట్రాక్‌షీట్లను రూపొందించాలి

▸▸ బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

రుద్రూరు,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయకూర్, రుద్రూర్ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. సొసైటీలకు సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేశారు. ధాన్యం సేకరణ గురించి కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ట్రాక్ షీట్‌లను తప్పనిసరిగా రూపొందించాలని, రైస్ మిల్లులతో కార్యదర్శులు నిరంతరం సంప్రదింపులు జరపాలని కార్యదర్శులను ఆయన ఆదేశించారు.



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ఏర్గట్ల, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని భీంగల్ సీఐ సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తాళ్లరాంపూర్‌లో పోలీస్ అమరవీరుల స్మారక కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడారు. యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలను వాడకూడదని, నవ సమాజ నిర్మాణానికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమంలో ఏర్గట్ల ఎస్‌ఐ పవన్ రాజేశ్వర్, తెలంగాణ రాష్ట్ర కబడ్డీ వైస్ ప్రెసిడెంట్ గంగారెడ్డి, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ రాజేకుమార్ రాజేందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న సీఐ సత్యనారాయణ

వేధిస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలి

ముప్కాల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మహిళలు బాలికలను ఎవరైనా వేధిస్తే షీటీంకు సమాచారం ఇవ్వాలని ప్రవర్తించినా, ఈవిటీజింగ్‌కు పాల్పడినా మహిళలు షీటీంకు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ షీటీం కానిస్టేబుల్ విగ్నేష్, సుమతి సూచించారు. మంగళవారం బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీటీంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళా ఉద్యోగులు ఈవిటీజింగ్ వేధింపులకు గురైతే 8712659795 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. అదే విధంగా క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఫియోద్దీన్ అస్లాం, మురళి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గల్ఫ్ బాధితుడికి అండగా ఉంటాం

ఏర్గట్ల, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం గల్ఫ్‌బాట పట్టి ఏజెంట్ చేతిలో జోర్డాన్ దేశంలో మోసపోయిన ఏర్గట్ల చెందిన వాల్గోట్ గంగాధర్‌కు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మండలాధ్యక్షుడు రాజాపూర్ణానందం పేర్కొన్నారు. మంగళవారం గంగాధర్‌ను ఇంటికి వెళ్లి అక్కడ ఎదుర్కొన్న బాధలను తెలుసుకున్నారు. గంగాధర్‌తో పాటు మరికొందరు స్వదేశానికి రావడానికి మాజీ మంత్రి హరీశ్‌రావు కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మధుసూదన్, గ్రామశాఖ అధ్యక్షుడు నర్సయ్య, బద్దం శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ నర్సయ్య పాల్గొన్నారు.



గంగాధర్‌తో మాట్లాడుతున్న నాయకులు

నేడు సాఫ్ట్‌బాల్ ఎంపికలు

ఆర్మూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల క్రీడా మైదానంలో బుధవారం పురుషుల జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ జట్టును ఎంపిక చేయనున్నట్లు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రధానకార్యదర్శి మర్కంటి గంగమోహన్ తెలిపారు. మధ్యాహ్నం నుంచి డిచ్‌పల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల క్రీడా మైదానంలో మహిళల జిల్లా సీనియర్ సాఫ్ట్‌బాల్ జట్టును మధ్యాహ్నం మూడు గంటలకు ఎంపిక చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు జిల్లా కోచ్‌లు నరేష్, మోసిటలకు రిపోర్టు చేయాలని కోరారు. మహిళల జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చేనెల 7వ తేదీ నుంచి జగిత్యాల జిల్లాలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు.

పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలి

నవీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): నవీపేట గ్రామ పంచాయతీ పరిధిలోని 1వ వార్డులో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని స్థానికులు కోరారు. కాలనీలోని పలు వీధుల్లో చెత్త కుప్పలు రోడ్ల పక్కన పేరుకుపోయాయని వారు పేర్కొన్నారు. పలు పొట్ట వీధి కుళాయిలకు బిరడాలు లేకపోవడంతో కుళాయిల వృథాగా వెళ్తుందని వారు వివరించారు. వెంటనే గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తగినంత సిబ్బందిని నియమించాలి

భీమ్‌గల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కార్యాలయంలో తగినంత సిబ్బంది నియమించాలని తెలంగాణ ప్రగతిశీల మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు రాజేశ్వర్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. మునిసిపల్ కార్యాలయంలో తగినంత సిబ్బంది లేనందున ఉన్న కొద్దిమందిపై పనిభారం పడుతుందన్నారు. వెంటనే సరిపడా సిబ్బందిని నియమించి తమ ఇబ్బందులు తొలగించాలన్నారు. అలాగే కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని కమిషనర్‌ను కోరారు. ఆయన వెంట పలువురు మునిసిపల్ కార్మికులు ఉన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న సిబ్బంది

అయోడైజ్డ్ ఉప్పు ఆరోగ్యానికి మేలు

మోర్తాడ్ అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): అయోడైజ్డ్ ఉప్పు వినియోగించడం ద్వారా అయోడిన్ లోపాన్ని నివారించవచ్చని కమ్మర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నరేందర్‌స్వామి అన్నారు. మంగళవారం మండలంలోని దర్పోలా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ లోపంపై అవగాహన కల్పించారు. అయోడిన్ ప్రాధాన్యత, శరీర అభివృద్ధి, మేధస్సు అభివృద్ధిలో అయోడిన్ చేసే కీలక పాత్రను విద్యార్థులకు వివరించారు. అదే విధంగా అయోడిన్ లోపం వల్ల కలిగే సమస్యలు, లక్షణాలు నివారణ చర్యలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమునందన చారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు

నేటి నుంచి సప్తాహ

నవీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ చారిత్రక విఠలేశ్వర ఆలయంలో బుధవారం నుంచి అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ప్రారంభం కానుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వచ్చే నెల 5న జరిగే కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో జాతర ఉంటుందన్నారు. దీనికి సంబంధించి వారం పాటు ఆలయంలో ఐదవ హరినామ సప్తాహంతో పాటు ప్రత్యేక పూజలు కొనసాగుతాయన్నారు.

ఏటీఎం సెంటర్ ప్రారంభం

నవీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లిలో కెనరా బ్యాంక్ ఏటీఎంను మంగళవారం బ్యాంక్ సీనియర్ మేనేజర్ మధు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్థానిక కెనరా బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఏటీఎంలో డబ్బులు డ్రా చేయడంతో పాటు జమ చేయడానికి సైతం అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అరవింద్, సంజీవ రావు, ప్రసాద్, భూమయ్య, నరేందర్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

మోర్తాడ్, జక్రాన్‌పల్లి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మోర్తాడ్ మండలం దర్మోరాలో మంగళవారం 73ఆవులు, గేదెలకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గౌతమ్‌రాజు తెలిపారు. జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ, బ్రాహ్మణపల్లిలో 588 పశువులకు టీకాలు వేసినట్లు ఏడీ డాక్టర్ గంగాధర్, పశువైద్యాధికారి డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆలూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చర్ల గ్రామానికి చెందిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి లోక రాంరెడ్డి కుమార్తె నవ్యరెడ్డి ఇటీవల ఆకస్మికంగా మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి నవ్యరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కంచెట్టి గంగాధర్, ఓబీసీ రాష్ట్ర నాయకులు యాదగిరి, ప్రణీత్ గౌడ్, సురేష్ యాదవ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



రాంరెడ్డి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ అరవింద్

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

వేల్పూర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జాన్కంపేట్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం గ్రామానికి చెందిన కొలిప్యాక సత్యారెడ్డి -చంద్ర (గంగు) దంపతులు దుప్పట్లను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అవసరమైన వస్తువులను అందజేయడానికి తాము ముందుంటామని సత్యారెడ్డి అన్నారు. సత్యారెడ్డి దంపతులకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

బ్యాట్లు అందజేత

ఆర్మూర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుర్బిర్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం స్థానిక గోల్డెన్ ఫ్రెండ్స్ యూత్ సభ్యులు బ్యాట్లను అందజేశారు. బ్యాట్లను అందజేసిన యూత్ సభ్యులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీశ్వర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు రాజు సాగర్, సిహెచ్ గంగాధర్, జీరాజు, ఎస్సీ ఉదయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోమాతకు అంత్యక్రియలు

రెంజల్,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలా గ్రామంలో హనుమాన్ మందిరానికి చెందిన గోమాత అనారోగ్యంతో మరణించడంతో గ్రామస్థులు కలిసి అంత్యక్రియలు నిర్వహించారు. వారం రోజుల క్రితం కుక్కకాటు వల్ల గోమాతకు రేబిస్ వ్యాధి సోకడంతో వారం పాటు చికిత్స నిర్వహించిన అనారోగ్యానికి గురై మరణించింది. గ్రామంలోని హనుమాన్ మందిరం నుంచి బాజాభజంత్రీలతో ఊరేగింపుతో గ్రామ శివారులో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు యోగేష్, గ్రామ పెద్దలు రామచందర్, గంగాధర్, సాయన్న, బాష్కర్, గణేష్, మహేష్, స్నేహిత్, రమేష్ తదితరులున్నారు.



నీలాలో గోమాతకు అంత్యక్రియలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

మహాసభలను జయప్రదం చేయండి

నసురుల్లాబాద్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో సంఘం ప్రతినిధులు మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ గౌడ్ మాట్లాడుతూ.. కల్లుగీత కార్మిక సంఘం ఏర్పడి 68 ఏళ్లు అవుతుందని ఈ ప్రయాణంలో ఎన్నో విజయాలు సాధించుకున్నామన్నారు. ధర్మబిక్షం, ఎస్ఆర్‌దాట్ల మల్లయ్య, తొట్ల మలుసూరు లాంటి అనేకమంది అమరవీరుల స్ఫూర్తితో ఈ సంఘం దీక్షతో పని చేస్తుందన్నారు. నవంబర్ 11న కామారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న మహాసభను జయప్రదం చేయాలని కోరారు. నవంబర్ 28, 29, 30వ తేదీల్లో సూర్యాపేటలో జరగనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్ గౌడ్, నాయకులు యాదగిరి గౌడ్, నర్సింహులు గౌడ్, దత్తాగౌడ్, వేణుగౌడ్, రాముగౌడ్, యాదగిరి గౌడ్, లక్ష్మణ్ గౌడ్ పాల్గొన్నారు.



సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కార్మికులు

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

బీర్కూర్, బాన్సువాడ రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): తూ కం వేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవ సాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పో చారం శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్, చించోల్లి, బాన్సువాడ గ్రామీణ మం డలం కొల్లూరు గ్రామాల్లో పర్యటించారు. గత 2 రోజుల పాటు కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించి డీఎస్‌వోతో ఫోన్‌లో మాట్లాడారు. లారీలకోసం ఎదురు చూడకుండా తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంట వెంటనే ట్రాక్టర్లలో రైస్ మిల్లుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది కలిగించకుండా రైస్ మిల్లర్లు సైతం వెంటనే ధాన్యం బస్తాలను దింపుకోవాలన్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



కిస్టాపూర్‌లో ధాన్యం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అంగన్‌వాడీలతోనే చిన్నారుల పోషణ

పెద్దకొడప్‌గల్, అక్టోబరు28, (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేస్తుంది అంగన్‌వాడీ కార్యకర్తలేనని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన పోషకమాసం సమావేశానికి హాజరై ప్రసంగించారు. సమాజంలో మహిళలు, చిన్నారుల పోషణ అంగన్‌వాడీ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. మద్నూర్ క్లస్టర్ ద్వారా 5 మండలాల్లో శిశు సంక్షేమ శాఖ ద్వారా 39,129 కుటుంబాలు లబ్ధిపొందుతున్నాయన్నారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. జిల్లా స్త్రీసంక్షేమ శాఖ అధికారి ప్రమీల, తహసీల్దార్ అనిల్, ఎంపీడీవో అభినవ్ చందర్,ఇంచార్జి సీడీపీవో కళావతి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

● పెద్దకొడప్‌గల్‌లో ఏర్పాటుచేసిన మొక్కజొన్న, సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం గదుల ఇళ్లలో ప్రజలకు తాగునీటిని అందించేందుకు రూ.33 లక్షలతో నిర్మిస్తున్న 30 వేల లీటర్ల సామర్థ్యం గల సంప్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.

ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న దృశ్యం

పిట్లం, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను లబ్ధిదారులు త్వరగా ప్రారంభించాలని ఎంపీడీవో రఘు అన్నారు. మంగళవారం పిట్లం మండలకేంద్రంలోని పలువురు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ వేసి మంజూరు పత్రాలు అందజేశారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు హనుమాండ్లు, కార్యదర్శి బలరాం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీర్కూర్ ఎంపీడీవోగా శ్రీనిధి

బీర్కూర్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల నూతన ఎంపీడీవోగా శ్రీనిధి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన గ్రూప్-1 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి బీర్కూర్ ఎంపీడీవోగా వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమావేశమై అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధిహామి పనులు, హరితహారం, స్వచ్ఛ భారత్, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాల పురోగతిని సమీక్షించారు. బీర్కూర్ మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా తీసుకెళ్తానని అన్నారు. అనంతరం ఆమెకు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

తాడ్వాయి, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి) ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి రఘునందన్ అన్నారు. మంగళవారం మండలంలోని కన్కల్, తాడ్వాయి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు మార్కింగ్ ఇచ్చారు. అర్హులైన లబ్ధిదారులు ఇళ్లను త్వరగా నిర్మించుకోవాలని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం కృష్ణాజివాడి గ్రామంలోని కొనుగోలు సెంటర్‌ను పరిశీలించారు. మండల అధికారి సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం అందజేత



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఫ్రెండ్స్ యూత్ క్లబ్

పిట్లం, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ టోర్నీలో పాల్గొనేందుకు వెళ్తున్న మండలకేంద్రానికి చెందిన క్రీడాకారుల బృందానికి ఫ్రెండ్స్ యూత్ క్లబ్ తరఫున మంగళవారం ఆర్థికసాయం అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు బొడ్ల శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వెళ్తున్న బృంద సభ్యులు విజయం సాధించాలని కోరుతూ తమవంతు సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సంతోష్, బాలకృష్ణ, ధర్మవీర్, సురేందర్, పాల్గొన్నారు.

అకాల వర్షాలు.. అన్నదాతల ఆందోళన



అకాల వర్షానికి తడిసిన ధాన్యం

బాన్సువాడ రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపూర్, ఇబ్రహీంపేట్, రాంపూర్, పోచారం, దేశాయిపేట్, బోర్లం, జుక్కల్‌దాని తాండా గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాలలో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎండబెట్టిన ధాన్యం తడిసి ముద్దవ్వడంతో ఇప్పటికే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడంలో అప్పులు కూరుకుపోవడం, తడిసిన ధాన్యంతో మరింత నష్టపోతున్నామని ఆందోళనకు గురవుతున్నారు. రైతులు ధాన్యం ఆరబెట్టుకోవడానికి అధికారులు టార్పాలిన్లు ఇవ్వకపోవడం, వ్యవసాయశాఖ అధికారులు సూచనలు చేయకపోవడంతో నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో సర్వేచేసి తడిసిన ధాన్యాన్ని ఆంక్షలు లేకుండా కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

డబ్బులు ఎవరికీ ఊరికే రావు



సాంకేతికత రోజురోజుకూ కొత్తపుంతలు తొక్కుతున్న క్రమంలో సైబర్‌నేరాలు పెచ్చుమీరుతున్నాయి. మొబైల్ ఫోన్లకు ఆఫర్ల పేరిట లింకులు పంపిస్తూ ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్నారు. అమాయక ప్రజల నుంచి అధికారుల వరకు చాలామంది ఈ సైబర్ మోసాల ఉచ్చులో పడుతున్నారు. పోలీసుశాఖ అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నప్పటికీ ఇంకా మోసాలు ఆగడంలేదు.

- రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలు
- ఆఫర్ల పేరిట మాయమాటలు
- ఖాతాల్లోంచి నగదు మాయం చేస్తున్న కేటుగాళ్లు
- అప్రమత్తంగా ఉండాలని పోలీసుల సూచన

దోమకొండ, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిత్యం ఎక్కడో ఒకరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతూనే ఉన్నారు. ప్రధానంగా దోమకొండ, రాజంపేట్, బీబీపేట, కామారెడ్డి మండలాల్లోని పలువురు ఇటీవల ఫేక్‌మెసేజ్‌లకు స్పందించి రూ.వేలల్లో డబ్బులు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. అలాగే లింక్‌లు పంపించి మీ నంబర్‌పై లక్కీడ్రాలో బహుమతులు వచ్చాయి, పూర్తి వివరాలను తెలుసుకోవాలంటే లింక్‌ను క్లిక్ చేసి ఓటీపీ చెబితే వివరాలు వస్తాయని నమ్మిస్తారు. దేనికైనా స్పందించి ముందుకెళ్తే నగదు పోగొట్టుకునే పరిస్థితి తప్పదు.

● రెండేళ్ల క్రితం మండలంలోని ఓ వ్యక్తికి మీ భూమిలో సెల్ టవర్ ఏర్పాటుకు అగ్రిమెంట్ పూర్తయిందని, ఆఫీస్ పనులు పూర్తయ్యాయని డాక్యుమెంట్ చార్జీలకు రూ.5 వేలు పంపిస్తే వెంటనే కంపెనీ అగ్రిమెంట్ డబ్బులు రూ. 10 లక్షలు మీ బ్యాంక్‌లో వేస్తామన్నారు. వారి మాటలు నమ్మి మోసపోయారు. అలాగే మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి మాయమాటలు చెప్పి నుంచి రూ. 24,900 బ్యాంక్ ఖాతాల్లోంచి చోరీ చేశారు.

టోల్ ఫ్రీ నంబర్లు ఇవే..

ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయామని తెలిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 155260, 100కి కాల్ చేసి 24 గంటల్లోపు తెలిపితే డబ్బులు ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని పోలీసులు చెబుతున్నారు.

జాగ్రత్త పాటిస్తే నగదు సేఫ్..

దోమకొండకు చెందిన ఓ మహిళకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి ఐడియా టవర్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నామని పరిచయం చేసుకున్నారు. మీ స్థలంలో సెల్ టవర్ వేస్తామని మాయామాటలు చెప్పి పూర్తి వివరాలు, వ్యవసాయ భూములు సర్వే నంబర్లను పంపించమని మాటలతో బురిడీ కొట్టించారు. రెండు రోజుల తర్వాత ఫోన్ చేసి మీ ఇంటిపై, వ్యవసాయ భూమిలో టవర్ వేసేందుకు అగ్రిమెంట్ అయినట్లు చెప్పి ఆధార్ నంబర్ ఎంట్రీ చేస్తామని నమ్మించి బ్యాంక్ వివరాలను రాబట్టేందుకు ప్రయత్నించారు. అగ్రిమెంట్ చార్జీలకు డబ్బులు పంపించాలని అడగగా మోసపోతున్నామని గ్రహించి సదరు కుటుంబీకులు ఆ నంబర్‌ను బ్లాక్ చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలి



ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి. ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో వచ్చే మెసేజ్‌లకు స్పందించొద్దు. నిజాలు తెలుసుకున్నాకే రిప్లై ఇవ్వాలి. గుర్తు తెలియని వ్యక్తులకు ఎలాంటి సమాచారం ఇవ్వొద్దు. భిక్కనూర్ సర్కిల్ పరిధిలో 25 ఆన్‌లైన్ మోసాలకు గురైన కేసులు నమోదయ్యాయి. - సంపత్ కుమార్ సీఐ, భిక్కనూర్

బ్యాంక్ వివరాలు ఇతరులకు చెప్పొద్దు



బ్యాంక్ నుంచి అధికారిని మాట్లాడుతున్నానని మీ ఏటీఎం రిన్యూవల్ చేస్తామని మీ మొబైల్‌కి ఓటీపీ వస్తుంది, అది చెప్పాలని అడిగితే ఎలాంటి సమాచారం చెప్పొద్దు. అలాగే లక్కీడ్రాల పేరిట బహుమతులు గెలుచుకున్నారని, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని అత్యాశకు గురిచేస్తారని అలాంటి మాటాలు నమ్మి మోసపోవద్దు. -స్రవంతి ఎస్సై, దోమకొండ

రవాణా సమస్యలు పరిష్కరించాలి

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 28, (ఆంధ్ర జ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ప్రజలు ఎదు ర్కొంటున్న రవాణా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మంగళవారం ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి వినతిపత్రం అందించారు. బస్సు కొరత, గ్రామీణ ప్రాంతా లకు తగిన సర్వీస్‌లు లేకపోవడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి మరిన్ని బస్సులు కేటాయిం చాలని, ఎల్లారెడ్డిలో ఆర్టీసీ డిపోను నెలకొల్పాలని వివరించినట్లు తెలిపారు. ఎండీ సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారని చెప్పారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

సీఎం దిష్టిబొమ్మతో ఊరేగింపు

ఇందల్వాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):ఏబీవీపీ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో వర్సిటీలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మతో ఊరేగింపు నిర్వహించి గేట్‌కు ఉరితీశారు. యూనివర్సిటీ అధ్యక్షుడు పృథ్వీ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల మొండి వైఖరి కారణంగా రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో 2 సార్లు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని బంద్‌కు పిలుపునివ్వడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా పూర్తి బకాయిలను చెల్లించి పేద మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కోరారు. యూనివర్సిటీ కార్యదర్శి సమీర్ మాట్లాడుతూ.. ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల పూర్తి స్కాలర్‌షిప్ ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత్ చారి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ మోహన్, ఉపాధ్యక్షులు అక్షయ్, అశోక్, అజయ్, మనోజ్, సంయుక్త కార్యదర్శులు అనిల్, అఖిల్, మీడియా ఇంచార్జి కార్తీక్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

రాజకీయ ప్రతినిధులకు ఎన్నికలపై శిక్షణ

మద్నూర్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో జుక్కల్ నియోజకవర్గ ఈఆర్‌వో (ఓటరు నమోదు అధికారి), జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.విక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశా లపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివ రించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన షెడ్యూ ల్‌లలో బీఎల్‌వోలకు సహకరించాలని, రాజ కీయ పార్టీల బూత్ లెవెల్ అసిస్టెంట్‌లను నియమించుకోవాలని సూచించారు. అనంతరం నియోజక వర్గంలోని ఎనిమిది మండలాల తహసీల్దార్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఇచ్చిన ఓటరు జాబితా ప్రత్యేక పునఃసమీక్ష షెడ్యూల్ ఇచ్చినందున దానిపై పకడ్బందీగా, తప్పులు జరగకుండా సమీక్ష చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్లు ఎండీ ముజీబ్, బి.అనిల్, వేణుగోపాల్ గౌడ్, లత, బిక్షపతి, మారుతి, రాజా నరేందర్ గౌడ్, నాయబ్ తహసీల్దార్‌లు శరత్, హేమలత, శివ రామకృష్ణ, రాజకీయ పార్టీల ప్రతినిధులు డి సాయిలు, టి సంతోష్, బస్సీపటేల్, రోహిదాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

పిట్లం, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను డీఎల్పీవో ప్రసాద్ రావు మంగళవారం పరిశీలించారు. గ్రా మ పంచాయతీ పరిధిలో ఓ వ్యాపారి జీప్లస్‌టు నిర్మాణానికి పర్మిషన్ తీసు కొని 3జీ ప్లస్ నిర్మాణ పనులు చేపడుతున్నారని ప్రజావాణిలో ఫిర్యాదు వచ్చిందన్నారు. నిర్మాణ దారుడు నిబంధనలు పాటించ కుండా అక్రమంగా నిర్మిస్తున్నందున నివేదికలు సిద్ధం చేసి ఉన్నతా అధికారులకు పంపిస్తా మన్నారు. ఎవరూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టవద్దని తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పరీక్షల తేదీలు విడుదల

ఇందల్వాయి, అక్టోబరు28, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వ విద్యాలయ పరిధిలో పీజీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్స్ (ఏపీఈ, ఐపీసీహెచ్) ఏడవ, తొమ్మిదవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు నవంబర్ 6 నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తామని కంట్రోలర్ ప్రొఫెసర్ సంపత్ కుమార్ తెలిపారు. పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందని కంట్రోలర్ తెలిపారు.

ఎల్లారెడ్డి ఎంపీడీవోగా తాహెరాబేగం

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండల నూతన ఎంపీడీవోగా తాహెరా బేగం మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. గత 10 నెలలుగా ఇంచార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన ప్రకాష్ పూర్తిస్థాయి ఎంపీడీవోగా నియమితులైన సందర్భంగా తాహెరా బేగంకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆమెకు కార్యాలయ సిబ్బంది, స్థానిక నాయకులు స్వాగతం పలికారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఏఎంసీ చైర్మన్ రజిత ప్రారంభించారు.రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెంది దళారులకు అమ్మి మోసపోవద్దని అన్నారు. ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, వైస్ చైర్మన్ రాజు, డైరెక్టర్లు గంగారెడ్డి, శంకరయ్య, రవీందర్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింలు, గోపికృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో పూజలు

ఎల్లారెడ్డి రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఈ నెల 24వ తేదీ నుంచి జరుగుతున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ జమదగ్ని, చింతల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, కల్యాణ మహోత్సవ వేడుకల్లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. సాయంత్రం ఎల్లమ్మ బోనాల ఊరేగింపు కార్యక్రమం పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్, కిసన్‌గౌడ్, సిద్ధాగౌడ్, ఆఫీస్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్ ఎండీపీవోగా అభినవ్

పెద్ద కొడప్‌గల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్ద కొడప్‌గల్ ఎంపీడీవోగా అభినవ్ చందర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ ఉద్యోగం కొత్తదైనా రానున్నరోజుల్లో మండలంలోని ఆయా గ్రామాలలో పర్యటించి ప్రజలతో మమేకమై సమస్యలు లేకుండా చూస్తానని తెలిపారు.

లా స్పాట్ అడ్మిషన్లకు అనుమతివ్వాలి

ఇందల్వాయి, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డా.రామావత్ లాల్ ఆధ్వర్యంలో తెలంగాణ ఉన్నత విద్యాశాఖ మండలి చైర్మన్ బాల కృష్ణారెడ్డిని కలిసి తెలంగాణ యూనివర్సిటీలోని ఖాళీగా ఉన్న లాసీట్ల భర్తీకి అనుమతి ఇవ్వాలని వినతి పత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ వర్సిటీలో ఖాళీగా ఉన్న లాఅడ్మిషన్లను భర్తీ చేయడంతో నిజామాబాద్ జిల్లా గ్రామీణ ప్రాంతంలో లా చదువుకునే విద్యార్థులకు న్యాయం జరుగుతుందని అన్నారు.

దారులే కల్లాలై.. ప్రయాణానికి కళ్లెమై

- రహదారులపై ధాన్యం ఆరబోత
- రక్షణగా రాళ్లు, ముళ్ల కంచెలు
- పయాణికులకు తప్పని ఇక్కట్లు

మద్నూర్, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండ లంలోని పల్లెల్లోని రహదారుల పై కొందరు సోయా, వరి ధాన్యం ఆరబోస్తుండటం ప్రమాదకరంగా మారింది. పైగా వాటికి రక్షణ గా రాళ్లు, ముళ్లకంచెలు వేస్తున్నారు. దీంతో ఆ రహదారిపై ప్రయాణించే వారికి ప్రాణ సంకటంగా మారు తుంది. అటుగా వచ్చే వాహనాల డ్రైవర్లు ఏ కొంచెం ఏమరపాటు వహించినా ప్రమాదాలే చోటుచే సుకునే అవకాశం ఉంది.

సగం రోడ్డు వరకు ధాన్యమే

10 ఫీట్ల వెడల్పు ఉన్న సింగిల్ రోడ్డులో సగం వరకు ధాన్యం ఆరబోస్తుండటంతో భారీ వాహనాల మాట దేవుడెరుగు, బైక్‌లు సైతం వెళ్లలేని పరిస్థితి ఉంది. రోడ్ల వెంట వాహనాలు వస్తాయన్న విషయాన్ని ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. రాత్రి సమయంలో రోడ్లపై ఉంచిన రాళ్లు కనిపించకపోవడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ధాన్యం ఆరబోతకు స్థలం కేటాయించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



రోడ్డుపై ఆరబోసిన సోయా పంట

ఊరంతా చీరలు పంచుతూ వివాహానికి ఆహ్వానం

దోమకొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాను పుట్టి పెరిగిన గ్రామస్తులందరి సమక్షంలో తన కుమారుడి వివహం వైభవంగా జరిపించుకోవాలనే కోరికతో తన గ్రామంలోని ప్రతీ ఇంటికి బ్యాగులో పెళ్లి కార్డు.. చీర పెట్టి గ్రామస్థులందరికీ ఆహ్వానం పలికాడు జనగామ గ్రామానికి చెందిన సుభాష్‌రెడ్డి. మహిళలకు చీరలతోపాటు వివాహ పత్రికలను అందజేస్తు తన కుమారుని వివాహానికి వచ్చి నూతన దంపతులను ఆశీర్వదించాలని కోరు తూ మంగళవారం సీతారాంపల్లి, జనగామ గ్రామాల్లో అందజేశారు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి. తన కుమారుడు నిహంత్‌రెడ్డి-హర్షిత వివాహం వచ్చేనెల 7వ తేదీన శంశాబాద్ హైదారాబాద్‌లోని జీఎంఆర్ అరినా ఫంక్షన్‌హాల్ జరుగనుండగా.. గ్రామంలో సుమారు 11 వందల మందికి పైగా మహిళలు ఉండగా వారందరికీ పెళ్లి కార్డుతోపాటు చీరలను పంపిణీ చేశారు. వివాహానికి రావాలని కోరారు. కార్యక్రమంలో మట్ట శ్రీనివాస్, సైదుగారి అశోక్‌గౌడ్, కప్పెర రవిందర్‌రెడ్డి, జీవన్ రెడ్డి, స్వామి, పీఆర్పీ పాత స్వామి, జలిగామ నాంపల్లి, సిద్దరాములు, రాజు, తదితరులు పాల్గొన్నారు.


వర్షానికి తడవకుండా యూరియా పట్టాతో కప్పిన ధాన్యం

'మొంథా' కలవరం

(5వ పేజీ తరువాయి)

ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అయితే గ్రామీణాభివృద్ధిశాఖ కాని, సహకారశాఖ కాని కొనుగోళ్ల విషయంలో సమన్వయంలేక పోవడంతో భారం అంతా పౌరసరఫరాల శాఖపైనే పడుతోంది. రైతులకు టార్పాలిన్‌లు అందించాల్సిన గ్రామీణాభివృద్ధిశాఖ, కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాల్సిన సహకార శాఖలు ధాన్యం కొనుగోళ్ల విషయంలో అంటిముట్టనట్లుగా వ్యవహరించడం శోచనీయం.

కలవరపెడుతున్న మొంథా తుఫాన్

మొంథా తుఫాన్ ప్రభావం జిల్లా రైతులను కలవరపెడుతోంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. పంట చేతికి వచ్చి విక్రయించే సమయంలో కురుస్తున్న వర్షాలతో రైతులను, అధికారులను ఇబ్బంది పెడుతున్నాయి. సరైన సౌకర్యాలు లేక రైతులు చేతికి వచ్చిన పంటను ఎక్కడ ఖాళీ స్థలం దొరికితే అక్కడ ఆరబెట్టుకున్నారు. కొనుగోలు కేంద్రాలలో ఉన్న టార్పాలిన్‌లు సరిపోను సంఖ్యలో లేవు. సొంత ఖర్చులతో కవర్‌లు తెచ్చుకుని చేతికి వచ్చిన పంటను రైతులు కాపాడే ప్రయత్నం చేస్తున్న రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు.

మెదడు పోటు.. మహా చేటు

(5వ పేజీ తరువాయి)

ప్రమాదకరమైన బ్రెయిన్ స్ట్రోక్‌కు మనిషి గురవ్వడానికి మారిన నేటి మానవ జీవనశైలియే ప్రధాన కారణంగా నిలుస్తోంది. నియంత్రణ లేని రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం, మద్యం సేవించడం, ఊబకాయం, రక్తనాళాల్లో కొవ్వు నిల్వలు పేరుకుపోవడం (అథెరోస్క్లె రోసిస్) లాంటి వాటి ద్వారా రక్తనాళాలలో సమస్యలు తలెత్తి మెదడుకు రక్తప్రసరణ నిలిచిపోయినప్పుడు మనిషి బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడతాడని వైద్య నిపుణులు చెబుతున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలు...

బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడే ముందు సదరు వ్యక్తిలో కొన్ని లక్షణాలు ముందస్తుగా కనిపిస్తాయని వైద్యులు చెబుతున్నారు. శరీరంలో ఒకవైపు తిమ్మిరి, బలహీనత, మాట తడబడడం, చూపు మసకబారడం, ఒక్కరు ఇద్దరుగా కనిపించడం, నడకలో ఇబ్బందులు తలెత్తడం, తీవ్రమైన తలనొప్పి, వాంతులు లాంటివి సంభవిస్తాయని చెబుతున్నారు. ఈ లక్షణాలను బ్రెయిన్ స్ట్రోక్ ప్రారంభ లక్షణాలుగా పరిగణించి వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు...

బ్రెయిన్ స్ట్రోక్ లాంటి ప్రమాదకరమైన వ్యాధి బారిన పడకుండా ముందస్తుగానే జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. నిరంతర వ్యాయామం శరీరంలో ప్రతి అవయవానికి రక్తప్రసరణను సమపాళ్లలో ఉంచుతుందని సూచిస్తున్నారు. ఒత్తిడిని తగ్గించుకోవడం ద్వారా రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధులను పెరగకుండా చూసుకునేందుకు నిరంతరం ధ్యానం, వ్యాయామం, యోగాసనాలు వంటివి చేయాలని సూచిస్తున్నారు. ఇటు వ్యాయామంతో పాటు అటు ఆహారపు అలవాట్లను సైతం మార్చుకోవాలని చెబుతున్నారు. అవిసే గింజలు, వాల్‌నట్స్, సోయాబీన్స్ వంటి వాటిని నిత్యం ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు. వీటిలో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు శరీరంలో కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయ పడతాయని సూచిస్తున్నారు. చక్కెర, నూనెలో వేయించిన పదార్థాలను తినడం మానేయడంతో పాటు ఆహారంలో తాజా పండ్లు, ఆకుపచ్చ కూరగాయలు, తృణ ధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలని సూచిస్తున్నారు. వ్యాయామం, ధ్యానం, యోగా ఆహారపు అలవాట్లలో మార్పులతో బ్రెయిన్ స్ట్రోక్‌కు చెక్ పెట్టవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

సోషల్‌మీడియా ఇన్‌చార్జ్‌గా నిహార్


నరాల నిహార్

ఇందూరు, అక్టోబర్ 28, (ఆంధ్రజ్యోతి) కేరళ యువజన కాంగ్రెస్ సోషల్‌మీడియా ఇన్‌చార్జ్‌గా నగరానికి చెందిన నరాల నిహార్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ యువజన కాంగ్రెస్ సోషల్‌మీడియా నేషనల్ హెడ్ మనుజైన్ ఉత్తర్వులు ఇచ్చారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ ఆదేశాల మేరకు, జాతీయ యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మనీష్‌శర్మ, ఉదయ్‌భాను జాతీయ అధ్యక్షుడు సూచనల మేరకు నియామకం చేశారు. కేరళలో యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంలో భాగంగా ఈ నియామకం చేశారు. ప్రస్తుతం నిహార్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. జాతీయ యువజన కాంగ్రెస్ సోషల్‌మీడియా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు. నిహార్ నగరానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత నరాల రత్నాకర్ తనయుడు.

ఐక్యతా ప్రదర్శనను విజయవంతం చేయాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎంపీ అరవింద్

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భారత యువజన క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి నవంబరు 25 వరకు జిల్లాలో యూనిటీ మార్చ్‌ను నిర్వహిస్తున్నట్లు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు అరవింద్ ధర్మపురి తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గ ప్రజలు సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150 జయంతి ఉత్సవాల్లో పాల్గొనాలని ఎంపీ పిలుపునిచ్చారు. పటేల్ దేశాభివృద్ధిలో ఎంతో కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశంలోని 500లకు పైగా సంస్థానాలను వీలినం చేసిన గొప్ప నాయకుడన్నారు. హైదరాబాద్ విలీనం కాకపోవడంతో ఆపరేషన్ పోలోకు నడుం బిగించి నిజాంను లొంగిపోయేలా చేశాడన్నారు. జిల్లాస్థాయి మార్చ్ అక్టోబరు 31న ప్రారంభం అవుతుందని నెహ్రూ యువకేంద్ర అధికారి శైలిబెల్లాల్ అన్నారు. మై భారత్ పోర్టల్‌లో అనేక అంశాలపై వ్యాసరచన పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో ప్రతిభచూపిన వారికి నవంబరు 26 నుంచి జరిగే జాతీయస్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. యూనిటీ మార్చ్ పోస్టర్‌లను ఎంపీ అరవింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా యుజవన క్రీడల అధికారి పవన్‌కుమార్ పాల్గొన్నారు.

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి

» కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి


రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

ఇందల్వాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): భూభారతి దరఖాస్తుల పరిశీలనలో జాప్యానికి తావు లేకుండా వెంటవెంటనే అర్జీలను పరిష్కరించాలని కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం డిచ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్, ఇతర సిబ్బందితో భూభారతి అమలుపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్‌లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి, ఎంత మందికి నోటీసులు ఇచ్చారు.. క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులు తిరస్కరణ గురైతే అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. అదేవిధంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీడిప్యూటీ కలెక్టర్ సందీప్, తహసీల్దార్ సతీష్ ఉన్నారు.

యువజనోత్సవాలకు దరఖాస్తుల ఆహ్వానం

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి యువజనోత్సవాలు నవంబరు 4న నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి పవన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని యువత జానపద నృత్యం (బృందం), జానపదగీతాలు (బృందం), కథా రచన, పేయింటింగ్, వకృత్వ పోటీ, కవిత్వ రచన, ఎగ్జిబిషన్ ఆఫ్ సైన్స్‌మేళాలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు 15 నుంచి 29 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలన్నారు. జిల్లా వాసులకు మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించిన యువతి, యువకులను రాష్ట్రస్థాయి యువజనోత్సవాలకు పంపనున్నట్లు వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనే కళాకారులు నవంబరు 3 వరకు మెయిల్, 9701177144, 995964957 నెంబర్లను సంపద్రించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

దివ్యాంగులకు అండగా న్యాయ సేవాసంస్థ


వినతిపత్రం స్వీకరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నిజామాబాద్ లీగల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు న్యాయసేవాధికార సంస్థ అండగా ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ జి.వి.ఎన్ భారతలక్ష్మి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌భాస్కర్‌రావు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రత్యేక అవసరాలు గల పిల్లల కేంద్రస్థాయిలోని దివ్యాంగుల తల్లితండ్రులు వారి పిల్లలు, న్యాయసేవ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్ భాస్కర్ రావుతో కలిసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ జీవీఎన్ భారతలక్ష్మిని జిల్లాకోర్టు ప్రాంగణంలోని ఆమె చాంబర్లో మంగళవారం కలిసి తమ గోడును వెల్లడించుకున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కేంద్రంలో నెలకొన్న సమస్యలను, దివ్యాంగుల గుర్తింపులో ఎదురవుతున్న ఇబ్బందులు, విద్యను అభ్యసించడంలో, విద్య సంబంధిత ధ్రువపత్రాలు, దివ్యాంగుల పెన్షన్ అందకపోవడం ప్రధానంగా ఉన్న విషయాలను వారు గమనించారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పిల్లల సమస్యలు పరిష్కరించే పని చేపడతానని ఆమె వివరించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల కేంద్రానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ తోడునీడగా నిలబడుతుందని పేర్కొన్నారు.

చెకుముకి సైన్స్-2025 సంబరాలు

నిజామాబాద్ లీగల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదికగా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు-2025 నవంబరు 7న పాఠశాల స్థాయి, నవంబరు 21న మండల స్థాయి, 28న జిల్లాస్థాయిలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడప్రతులను జిల్లా డీఎల్ఎస్ఏ సెక్రటరీ ఉదయభాస్కర్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైన్స్ ప్రతి మనిషిలో విజ్ఞానం పెంపొందించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నటువంటి 8, 9, 10వ తరగతి విద్యార్థులకు పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వర్, శ్రీహరి ఆచార్య, కోశాధికారి పండరి, జైపాల్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

నేటి నుంచి మహోత్సవాలు

ధర్పల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బాకలో పెద్దమ్మ తల్లి ఆలయాన్ని పునఃనిర్మాణాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆలయంలో పెద్దమ్మ తల్లి స్థిర విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను బుధవారం నుంచి 3రోజులపాటు నిర్వహించుచున్నట్లు ముదిరాజ్ సంఘ సభ్యులు తెలిపారు. ఈనెల 29న అఖండ దీపారాధన, ధ్వజారోహణ, మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, భారతి తీర్థప్రసాద వితరణ, 30న నవగ్రహ హోమం, చండీహోమం, కుంకుమార్చన, భజన కార్యక్రమాలు, 31న విగ్రహ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, శిఖర ప్రతిష్ఠ, కుంభాభిషేకం, కళ్యాణోత్సవం, బోనాలు సమర్పించడం, మహా అన్నప్రసాద కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

అయోడైజ్డ్ ఉప్పుతోనే మేలు

సుభాష్‌నగర్, అక్టోబర్ 28, (ఆంధ్రజ్యోతి) అయోడైజ్డ్ ఉప్పుతోనే విద్యార్థుల్లో శారీరక, మానసిక ఎదుగుదల ఉంటుందని జిల్లా ఆరోగ్య అవగాహన అధికా రి వెంకటేశ్వర్లు తెలిపారు. జిల్లాకేంద్రంలోని దుబ్బ ప్రభుత్వ పాఠశాలలో అయోడిన్ లోపం మానసిక రుగ్మతలు, వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అయోడిన్ లోపం వల్ల జ్ఞాపకశక్తి లోపిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్య అధికారులు శ్రీనివాస్, విమలేశ్వరీ, మలేరియా పురుశోత్తం, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

యూబీఐ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కరప్షన్ ఫ్రీ దేశం, కరప్షన్ ఫ్రీ బ్యాంకులు ఉండేలా అందరూ పాటుపడాలని యూనియన్ బ్యాంక్ డీజీఎం కోట అరుణ సవిత తెలిపారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ప్రగతినగర్ నుంచి పూలాంగ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విజిలెన్స్ అవగాహన వారోత్సవాల ముఖ్య ఉద్దేశం బ్యాంకుల పాలన పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలన్నారు. జీవితంలో అన్ని అంశాల్లో పారదర్శకత, సమగ్రత, నైతిక ప్రవర్తన సంస్కృతిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అనంతరం బ్యాంకు ఉద్యోగులకు కంటి పరిక్షలు చేయించారు. కార్యక్రమంలో ఏజీఎంలు శ్రీలత, జయకృష్ణ, యూనియన్ బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే


ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుతో కలిసి ఎర్రగడ్డ డివిజన్‌లో పలు కాలనీల్లో తిరుగుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉప ఎన్నికల్లో బీజేపీకి భారీ మెజార్టీ రావడం ఖాయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని జూబ్లీహిల్స్ ప్రజలు బీజేపివైపే మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు సన్నాహాలు


కలెక్టరేట్ వద్ద కొనసాగుతున్న పనులు

ఇందూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇటీవల హైదరాబాద్‌లోని సెక్రెటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులు మంగళవారం ప్రారంభించారు.

కమీషన్ల కోసం పీడించి కాంట్రాక్టర్లను బెంబేలెత్తించారు..

(5వ పేజీ తరువాయి)

కానీ రాష్ట్ర ప్రభుత్వమే మొత్తం నిధులు విడుదల చేసినట్లు చెప్పడం సరికాదన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆరు మునిసిపాలిటిలకు రూ.169.3 కోట్లు మంజూరయ్యాయని ఆయన అన్నారు.

గతంలో ఎంపీగా ఉన్న కవిత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైల్వే ఓవర్ బ్రిడ్జీల కాంట్రాక్టర్‌లను కమీషన్‌ల కోసం బెదిరించడం వల్లే వారు పారిపోయారని అందువల్లే పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. కేంద్రం నుంచి నిధులు రావడంలేదని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ వాఖ్యానించడం ఆయన విషయ పరిజ్ఞానాన్ని తెలియజేస్తుందని ఆయన అన్నారు. ఎమ్మెల్సీ కవిత మండలి చైర్మన్ గుత్త సుఖేందర్‌రెడ్డిని కలిసి రాజీనామా ఇచ్చినా ఎందుకు ఆమోదం తెలపడంలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్రవంతిరెడ్డి ద్వారా స్పీకర్‌కు లేఖ పంపామని దీనికి సమాధానం చెప్పాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేసుందని వర్షాల వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. రైతుల విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని నిర్వహణ వ్యవస్థ విఫలమైందని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేసి కేసీఆర్ బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను మోసం చేశారని అన్నారు. అణగారిన వర్గాలు ఎదగడం కల్వకుంట్ల కుటుంబానికి ఇష్టం లేదన్నారు. ఈ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి పాల్గొన్నారు.

రాబోయే 20 ఏళ్ల అవసరాలకు మాస్టర్ ప్లాన్

(5వ పేజీ తరువాయి)

సమర్పించాలని సూచించారు. ఇప్పటికే పై రెండు పురపాలికల్లో డ్రోన్ సర్వే పూర్తిచేశారని, ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల పరిశీలన ప్రక్రియ కూడా జరిపారని వెల్లడించారు. సంబంధిత శాఖలు అందించే వివరాలను క్రోడీకరిస్తూ, ముసాయిదా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తారని, రానున్న 20 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రణాళిక రూపొందుతుందని తెలిపారు. ఇప్పటికే నిజామాబాద్ నగర ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపామని కలెక్టర్ గుర్తు చేశారు. కాగా, పట్టణాల భవిష్యత్ అభివృద్ధి, తాగునీటి సరఫరా మెరుగుదల, పార్కుల అభివృద్ధి వంటి వాటికి మాస్టర్ ప్లాన్ ఏవిధంగా ఉపకరిస్తుందనే అనే అంశాలను అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ జాయింట్ డైరెక్టర్ రష్మీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ వర్క్ షాప్ లో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, బోధన్, ఆర్మూర్ మునిసిపల్ కమిషనర్లు జాదవ్, రాజు, మున్సిపల్, రెవెన్యూ, ప్రజారోగ్యం, జిల్లా పరిశ్రమలు, జాతీయ రహదారులు, రోడ్లు- భవనాలు, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మెప్మా, రైల్వే, ఆర్టీసీ, రవాణా, పోలీస్, టూరిజం, ట్రాన్స్ కో, విద్యా, వైద్యం, వ్యవసాయం, గనులు, కాలుష్య నియంత్రణ మండలి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రో'హితుడు'

» సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన రోహిత్‌గౌడ్

ఇందల్వాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవలే కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పలు రోడ్లు దెబ్బతిన్నాయి. మట్టి రోడ్లు గుంతలు పడి రాకపోకలకు ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. అది చూసి చలించిన డొంకల్ గ్రామానికి చెందిన ఓ యువకుడు రోడ్డు మరమ్మతులు చేయడానికి ముందుకొచ్చాడు. మండలంలోని డొంకల్ నుంచి కోటాల్‌పల్లి వెళ్లే మట్టి రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో రోహిత్‌గౌడ్ అనే యువకుడు సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టాడు. దీంతో వాహనదారులకు ప్రయాణం సులభతరమైంది. అతడు చేపట్టిన పనికి ప్రజలు రోహిత్‌గౌడ్‌ను అభినందిస్తున్నారు.

రోడ్డును చదును చేయిస్తున్న రోహిత్ గౌడ్ →



బాల్య వివాహాలను అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవీందర్ రావు

సిరికొండ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టడంలో గ్రామ స్థాయి అధికారులు చురుగ్గా వ్యవహరించాలని జిల్లా బాలల పరిరక్షణ అధికారి నాగేశ్లి బాబు, తహసీల్దార్ రవీందర్‌రావు పంచాయతీ కార్యదర్శులను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బాల్యవివాహాలపై అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి నాగేశ్లి బాబు మాట్లాడుతూ.. ఆడ పిల్లలకు 18, పురుషులకు 21 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు జరిగేలా చూడాలన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను, వారికి పుట్టబోయే పిల్లల ఆరోగ్య పరిస్థితి గురించి వివరించారు, అంగవైకల్యం, మానసికంగా పిల్లలు ఎదుగుదల ఉండకపోవడం, మాతృ, శిశు మరణాలు సంభవించే అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. బాల్య వివాహాలతో భార్యభర్తల మధ్య వైవాహిక సంబంధాలు మెరుగుపడక అవగాహన లేమితో విడిపోయే అవకాశాలుంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, మండల వైద్యాధికారి అరవింద్, ఐసీడీఎస్ పర్యవేక్షకులు సవిత, అరుణ, నాగలక్ష్మి, జ్యోత్స్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు రాజకీయ చైతన్యం పెంచుకోవాలి

» ముదిరాజ్ జాతీయ మహాసభ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశం


సమావేశంలో మాట్లాడుతున్న కాసాని వీరేశం

ఇందల్వాయి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కే ఎస్ఆర్ గార్డెన్లో జిల్లా ముదిరాజ్ మహాజనసభను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాతీయ ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశం హాజరయ్యారు. ముదిరాజ్ కులస్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాసాని వీరేశం మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్థులందరూ తమ కుటుంబ సభ్యులను ఉన్నత విద్య వరకు చదివించాలని, ఆర్థికంగా రాజకీయంగా చైతన్యం పెంచుకోవాలని కోరారు. చట్టసభల్లో సామాజిక వెనుకబడిన ముదిరాజ్‌లను బీసీ -డీ నుంచి ఏ-గ్రూప్‌లోకి మార్చాలని, ప్రభుత్వాన్ని ఎదిరించి పోరాడటానికి ఐక్యం కావాలని కోరారు. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు 42 శాతం ఇస్తే అందులో ప్రధాన వాటా ముదిరాజ్‌లకే ఉంటుందన్నారు. 1978 రిజర్వేషన్ చట్టం అమలులో కులగణన జరిగి బీసీ రిజర్వేషన్లు ఏర్పాటు చేశారన్నారు. అప్పటి నుంచి బీసీలు, ముదిరాజుల కుల గణన నిర్వహించలేదని దీని ద్వారా ముదిరాజ్‌లకు తెలంగాణలో బీసీ డీ గ్రూపులోనే ఉన్నారన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి లభించడంలో ముదిరాజ్‌లకు అన్యాయం జరిగిందన్నారు. చట్టసభలలో ముదిరాజ్‌లను జనాభా ప్రకారం తెలంగాణలో 26 మంది ఎమ్మెల్యేలు గెలిచి తీరాలన్నారు. డాక్టర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగ విధానం ప్రకారం బీసీ రిజర్వేషన్ పొందడానికి బడుగు బలహీన మైనార్టీ కులాల ఐక్యత కలిగి ఉండడం అవసరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముదిరాజులు చేపలు పట్టే వృత్తి ద్వారా ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముదిరాజ్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కిట్స్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు



సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు

సుభాష్‌నగర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. జిల్లాకేంద్రంలోని కాకతీయ మహిళా కళాశాల ప్రాంగణంలో రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు మొదటి సంవత్సర విద్యార్థినులకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ వేడుకల్లో కళాశాల చైర్మన్ సీహెచ్ విజయలక్ష్మి ప్రిన్సిపాల్ డాక్టర్ సెల్వరాజ, వైస్ ప్రిన్సిపాల్ సాయరెడ్డి, వివిధ విభాగాల అధికారులు, తదిరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

దేవి	: బైసన్ (తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్	: కాంతారా చాప్టర్-1 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్	: కె-ర్యాంప్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్	: డ్యూడ్ (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1	: కె-ర్యాంప్ (11.00, 4.40, 7.30, 10.20)
	:బైసన్ (తెలుగు) (1.35)
స్క్రీన్-2	: డ్యూడ్ (1.30,7.30)
	: తెలుసు కదా (4.30)
	:బైసన్ (తెలుగు) (10.20)
స్క్రీన్-3	:బైసన్ (తెలుగు) (11.00,4.30)
	:తమ్మ(1.50,7.30)
	:ఎక్ దివానికి దివానియత్:(హింది) (10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1	: డ్యూడ్ (11.00, 2.05, 5.00, 7.55, 10.50)
స్క్రీన్-2	: కాంతారా చాప్టర్-1 (10.20)
	: కె-ర్యాంప్ (1.45, 7.35, 10.30)
	: మిత్రమండలి (4.40)
స్క్రీన్-3	: తెలుసు కదా (11.00, 1.55, 4.50, 7.45, 10.40)
స్క్రీన్-4	: కె-ర్యాంప్ (10.20) : మిత్రమండలి (1.15, 7.35)
	: కాంతారా చాప్టర్-1 (4.10, 10.30)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,8,500	రూ.1.09,200	రూ.1450

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.155	రూ.255	రూ. 275
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.260	రూ. 280

